క్లుప్తంగా

రెడ్‌క్రాస్ చేయూత



బాధిత కుటుంబానికి సామగ్రి అందజేత

జలదంకి : స్థానిక నెహ్రూనగర్ కాలనీలో ఇటీవల అగ్నిప్రమాదం కారణంగా సర్వం కోల్పోయిన కుటుంబానికి మండల రెడ్‌క్రాస్ శాఖ అండగా నిలిచింది. బాధిత పొట్లూరి నాగరాజు కుటుంబానికి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గురువారం సహాయ సామగ్రిని అందించారు. ఇందులో వంట పాత్రలు, టార్పాలిన్ పట్ట, సబ్బులు, టూత్‌పేస్ట్‌లతో కూడిన హైజీనిక్ కిట్‌ను అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మండలాధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి, కార్యదర్శి వాకా హజరత్‌రెడ్డి, కోశాధికారి పువ్వాడి సురేష్‌కుమార్, సభ్యులు రఘు, నవీన్‌నాయుడు పాల్గొన్నారు.

రక్త నమూనాల సేకరణ పూర్తి

వరికుంటపాడు : మండలంలోని పెద్దిరెడ్డిపల్లి, వరికుంటపాడు గ్రామాల్లో ఫైలేరియా వ్యాధి నిర్ధారణకు సంబంధించి రక్త నమూనాల సేకరణ పూర్తయినట్లు వైద్యులు ఆయేషా, కరీష్మా గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మండల కేంద్రంలో జరిగిన రక్త నమూనాల సేకరణ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. మండలంలో దాదాపు 300 మంది రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజశేఖరరాజు, పీహెచ్‌ఎన్ సుశీలమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ



ఆత్మకూరురూరల్ : ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ క్యాలెండర్లు, డైరీల ఆవిష్కరణ కార్యక్రమం మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో గురువారం నిర్వహించారు. ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి సురేంద్రరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ రామిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి కలిసి తహసీల్దార్ జగదీష్‌బాబు చేతుల మీదుగా క్యాలెండర్లు ఆవిష్కరించారు.

రేషన్ పంపిణీపై సమావేశం

చేజర్ల : రేషన్ బియ్యం, సరుకుల పంపిణీపై ఎండీయూ(మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్) ఆపరేటర్లు, రేషన్ డీలర్లతో స్థానిక వైకేపీ కార్యాలయంలో తహసీల్దార్ కృష్ణ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనవరి 1వ తేదీ నుంచి వలంటీర్ పరిధిలో రేషన్ బియ్యం, సరుకులను పంపిణీ చేసే చోట డిస్ట్రిబ్యూషన్ పాయింట్లను ఏర్పాటు చేశామన్నారు. ఒక పాయింట్‌లో ఐదుగురు లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయాలన్నారు. ఇలా ఇచ్చే ప్రాంతాన్ని ముందుగా తెలియజేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీటీ విజయ్ పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆటల పోటీలు ప్రారంభం



కావలి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగుల ఆటల పోటీలు గురువారం జరిగాయి. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి సతీమణి ఆదిలక్ష్మి ఈ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దివ్యాంగుల్లో మనోధైర్యం నింపి వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. దివ్యాంగులకు భరోసా కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానికవైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

ఎంఈఓ-2 ప్రభాకర్‌రెడ్డికి గాయాలు

సోమశిల : అనంతసాగరం మండల విద్యాధికారి-2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విధులకు వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డారు. వివరాల్లోకెళ్తే.. మంచాలపల్లి నుంచి అనంతసాగరానికి బైక్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో చేయి ఫ్యాక్చర్ అయినట్లు సమాచారం.

కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ఆత్మకూరు : కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర పీసీసీ ప్రధాన కార్యదర్శి చేవూరు శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో తొలుత కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ ఆవిర్భావం గురించి వివరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగరాజు, నియోజకవర్గ యూత్ నేతలు రాంకీ, సయ్యద్ రసూల్ పాల్గొన్నారు.

ఫుల్‌జోష్‌తో ఆడుదాం ఆంధ్రా

- పండగ వాతావరణంలో క్రీడా పోటీలు

ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు ఫుల్‌జోష్‌తో జరుగుతున్నాయి. క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో తలపడుతూ తమ ప్రతిభను కనబరుస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు పలు గ్రామాల్లో గురువారం క్రీడాపోటీలను ప్రారంభించి, ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కొండాపురం : కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ఉదయగిరి : మండలంలో క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. వెంగళరావునగర్ సచివాలయ పరిధిలోని గండిపాళెం ఏపీ బాలుర గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో కబడ్డీ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా తలపడ్డారు. ఈ సందర్భంగా పంచాయతీ, సచివాలయ కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి, హీనా మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చూపిన వారు మండలస్థాయికి ఎంపికవుతారన్నారు. కార్యక్రమంలో గండిపాళెం, వెంగళరావునగర్ సర్పంచ్‌లు జి.కల్పన, ఎం.తిరుపతి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పుష్పరాజ్, పీఈటీ వాసు, వీఆర్వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా..

కలిగిరి : మండల కేంద్రంలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా వాలీబాల్ పోటీలను జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, సర్పంచ్ రాగి దివ్య, ఉప సర్పంచ్ పాలూరు మాల్యాద్రిరెడ్డి గురువారం పర్యవేక్షించారు. క్రీడాకారులకు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించడంతో పాటు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

- **జలదంకి :** మండలంలో మూడో రోజూ ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల సందడి నెలకొంది. 13 సచివాలయాల పరిధిలో క్రీడా పోటీలను గురువారం విజయవంతంగా నిర్వహించారు. క్రికెట్‌తో పాటు వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సచివాలయ ఉద్యోగులు, పీఈటీలు పోటీలను పర్యవేక్షించారు.

హోరాహోరీగా..

కొండాపురం : మండల కేంద్రమైన కొండాపురంలో జెడ్పీ, ఆదర్శ పాఠశాల, తూర్పు ఎర్రబల్లి జెడ్పీ పాఠశాలల్లో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు గురువారం కూడా హోరాహోరీగా జరుగుతున్నాయి. ఖోఖోలో 15 మంది పురుషులు, 16 మంది మహిళలు, కబడ్డీలో 26 మంది పురుషులు, 16 మంది మహిళలు, వాలీబాల్‌లో 21 మంది పురుషులు, 14 మంది మహిళలు, బ్యాడ్మింటన్‌లో 93 మంది పురుషులు, 43 మంది మహిళలు, క్రికెట్‌లో 52 మంది పురుషులు, 13 మంది మహిళలు పోటీల్లో పాల్గొన్నట్లు ఎంపీడీఓ బ్రహ్మయ్య తెలిపారు.

- **చేజర్ల :** మండలంలోని 15 సచివాలయాల పరిధిలో తొమ్మిది మైదానాల్లో కబడ్డీ పోటీలు గురువారం ఉత్కంఠ భరితంగా సాగాయి. 17 పురుషుల టీమ్‌లు, 12 మహిళల టీమ్‌లు పోటీ పడ్డాయి. ఆదూరుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన కబడ్డీ పోటీలను పంచాయతీ సెక్రటరీ అచ్చి ఆంజనేయులు, హెచ్ రమేష్, పీడీ శ్రీనివాసులు ప్రారంభించారు. మండల వ్యాప్తంగా పోటీలను మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మల్లికార్జున పర్యవేక్షించారు.

- **ఆత్మకూరు :** పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆడుదాం ఆంధ్రా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మూడో రోజు కబడ్డీ, క్రికెట్, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ తదితర క్రీడల్లో పోటీలు జరిగాయి. పాఠశాల హెచ్‌ఎం అనంతలక్ష్మి, పీఈటీలు తిరుపతయ్య, సురేష్, జమునారాణి పోటీలను పర్యవేక్షించారు.

క్రీడలతో మానసికోల్లాసం

వరికుంటపాడు : క్రీడల వల్ల మానసికోల్లాసంతో పాటు, శారీరక దృఢత్వం పెరుగుతుందని ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి పేర్కొన్నారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, వరికుంటపాడు, తూర్పురొంపిదొడ్ల, గణేశ్వరపురం సచివాలయాల పరిధిలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా గణేశ్వరపురం, రొంపిదొడ్లలో క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో శనివారం వరకు పోటీలు జరుగుతాయన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారిని మండలస్థాయికి ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు బి.వెంకటనారాయణరెడ్డి, బత్తిన కొండమ్మ పాల్గొన్నారు.



అనుమసముద్రంపేట : క్రీడాపోటీలను తిలకిస్తున్న ఆర్డీఓ మధులత



ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

ఆర్డీఓ పరిశీలన

అనుమసముద్రంపేట : ఏఎస్‌పేటలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలను ఆత్మకూరు ఆర్డీఓ మధులత గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీఓ భాస్కర్, ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



వరికుంటపాడు: గణేశ్వరపురంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీఓ



కలిగిరిలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు



ఉదయగిరి : కబడ్డీ పోటీలో తలపడుతున్న మహిళలు

చిత్రలేఖనంలో కరటంపాడు విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో పాల్గొన్న కరటంపాడు విద్యార్థులు



విష్ణు, బ్రహ్మ, మహేశ్వరుల చిత్రం

ఆత్మకూరురూరల్ : మండలంలోని కరటంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు చిత్రలేఖనం పోటీలో బంగారు పతకాలు పొందారని పాఠశాల డ్రాయింగ్ టీచర్ బాబురావు గురువారం తెలిపారు. జిల్లాలో అమీర్ ఆర్ట్స్ అకాడమి వారు నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 16 మంది విద్యార్థులు ఈ ఘనత సాధించారని తెలిపారు. గతేడాది ఎనిమిది మంది చిత్రలేఖన పోటీల్లో బంగారు పతకాలు సాధించగా, ఈ ఏడాది 150 మంది విద్యార్థులు ఏకకాలంలో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొని 16 మంది ప్రశంసాపత్రాలతో పాటు బంగారు పతకాలు పొందారన్నారు. ఈనెల 30వ తేదీ నెల్లూరు టౌన్ హాల్లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, అవార్డులు అందజేస్తారన్నారు.

యువత జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న సీఐ రవినాయక్

అనుమసముద్రంపేట : నూతన సంవత్సరం రానున్న తరుణంలో యువత జాగ్రత్తలు పాటించాలని సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్ అన్నారు. ఏఎస్‌పేట పోలీస్ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. 2023లో క్రైమ్ రేట్ పూర్తిస్థాయిలో తగ్గిందని వివరించారు. పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండడం వల్ల రోడ్డు ప్రమాదాలు సైతం తగ్గాయన్నారు. డిసెంబర్ 31న రాత్రి యువత రోడ్లపైన కేక్‌లు కట్ చేయడం లాంటివి మానుకోవాలని, మద్యం తాగి రోడ్లపైన ద్విచక్ర వాహనాలతో హల్‌చల్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా యువత జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నూతన సంవత్సరానికి అందరూ సంతోషంగా స్వాగతం పలికాలని సూచించారు. ఆయన వెంట ఎస్సై నరేష్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

26 మందికి పట్టాల పంపిణీ



భూ పట్టా అందజేస్తున్న తహసీల్దార్, నాయకులు

అల్లూరు : 2003కు ముందు అసైన్‌మెంట్ పట్టా పొంది ఇప్పటికీ సాగు చేసుకుంటున్న 26 మంది రైతులకు సర్వ హక్కులు కల్పిస్తూ ప్రభుత్వ పట్టాలను అందజేశామని తహసీల్దార్ చంద్రశేఖర్ తెలియజేశారు. ఈ మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్‌తో కలిసి ఆయన గురువారం పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 20 ఏళ్ల సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపిందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ టౌన్, రూరల్ కన్వీనర్లు దండా కృష్ణారెడ్డి, బీద రమేష్, పార్టీ నేతలు షేక్.ఉస్మాన్, భక్తవత్సల్ రెడ్డి, శ్రీను, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీతారామపురం : మండలంలోని సింగారెడ్డిపల్లి పంచాయతీలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను ఎంపీటీసీ వెంకటమ్మ, సర్పంచ్ సంపూర్ణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ఏఈ బాలినేని ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి స్థానిక ప్రజలు రోడ్డు సమస్యను వివరించారని, దీనిపై ఎంపీపీ పద్మావతి ప్రత్యేక చొరవ తీసుకొని రూ.20 లక్షల నిధులు కేటాయించారన్నారు. ఈ నిధులతో సిమెంట్ రోడ్డు పనులు జరుగుతున్నాయని వివరించారు. నేత రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇన్వర్టర్, బ్యాటరీల వితరణ



అల్లూరు : స్థానిక అల్లూరు రామకృష్ణా జూనియర్ కళాశాల(ఎయిడెడ్)కు రూ.45 వేలు విలువ చేసే ఇన్వర్టర్, రెండు బ్యాటరీలను కళాశాలకు చెందిన సూపరింటెండెంట్ నాగభూషణం గురువారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు కళాశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

ఆర్బీకేల్లో సమృద్ధిగా ఎరువులు



అల్లూరు : మండల పరిధిలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి లలిత తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె గురువారం మాట్లాడుతూ మండలంలో రైతులు ముమ్మరంగా వరినాట్లు వేసి ఉన్నారని, వారికి సరిపడా ఎరువులను రైతు భరోసా కేంద్రాల్లో నిల్వ చేసినట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

- ఏఓ రజనీ



రైతులతో మాట్లాడుతున్న ఏఓ రజనీ

అనుమసముద్రంపేట : తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారిణి రజనీ కోరారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులతో ఆమె గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలైన మొక్కజొన్న, సజ్జలు, రాగులు, వేరుశనగ, పత్తి లాంటి పైర్లను వేసుకుని అధిక ఆదాయం సంపాదించుకోవాలని కోరారు. ప్రస్తుతం సాగునీటికి ఇబ్బందిగా ఉందని, రైతులు నారుమడులకు బదులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఏఈఓ చిరంజీవి, వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.

న్యాయవాదుల నిరసన

కావలి : పట్టణంలోని కోర్టు సముదాయం ముందు న్యాయవాదులు గురువారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను, జీఓ నంబర్ 512ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కావలి బార్ అసోసియేషన్ కార్యదర్శి జయప్రకాష్, న్యాయవాదులు రాజేంద్ర వరప్రసాద్, జగన్‌మోహన్ రావు, మల్లికార్జున, సాయిప్రసాద్, రుషి కుమార్, కిరణ్, సునీల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ వికసిత్ భారత్

చేజర్ల : మండలంలోని వావిలేరు, మైపాటివారికండ్రిగ గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గురువారం రెండో రోజూ జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి అధికారులు, నాయకులు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కరిముల్లా పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



సంగం : మండలంలోని తరుణవాయి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త వనమ్మ గుండెపోటుతో బుధవారం మృతి చెందగా, అంగన్‌వాడీ ప్రాజెక్ట్ ద్వారా రూ.12,620ల నగదును వారి కుటుంబసభ్యులకు అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వనమ్మ కుటుంబసభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ అధ్యక్షురాలు సుజాతమ్మ, ఉపాధ్యక్షురాలు శేషమ్మ, కార్యదర్శి రెహానా తదితరులు పాల్గొన్నారు.

కుష్టును ప్రాథమిక దశలో గుర్తించాలి



దుత్తలూరు : కుష్టువ్యాధిపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



కలిగిరి: పెద్దకొండూరులో వృద్ధురాలిని పరిశీలిస్తున్న వైద్యాధికారిణి

దుత్తలూరు : కుష్టువ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించాలని, తద్వార వ్యాధిని నయం చేయవచ్చని దుత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి వనజ తెలిపారు. మండలంలోని పాపంపల్లిలో కుష్టువ్యాధిపై గ్రామస్తులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే నెల 12వ తేదీ వరకు 14 బృందాలు గ్రామాల్లో సర్వే చేపడుతాయని, ప్రతి ఇంటినీ సందర్శించి స్పర్శలేని మచ్చలున్న వారిని గుర్తిస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదెమ్మ, ఎంపీడీఓ సాయిప్రసాద్, సూపర్‌వైజర్ ఖాజామొహిద్దీన్, హెల్త్ అసిస్టెంట్ శ్రీహరి, ఎంఎల్‌హెచ్‌టీ కిరణ్మయి, ఏఎన్ఎం ప్రశాంతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా..

కలిగిరి : మండలంలో లెప్రసీ సర్వేను ముమ్మరంగా చేపడుతున్నామని వైద్యాధికారిణి బి.గీతారెడ్డి తెలిపారు. పెద్దకొండూరులో నిర్వహిస్తున్న లెప్రసీ సర్వేను ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయినింగ్ (ఎల్‌సీడీసీ) కార్యక్రమాన్ని 15 రోజుల పాటు నిర్వహిస్తోందన్నారు. ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే జరిపి కేసులను గుర్తిస్తుందన్నారు.

శరవేగంగా పనులు పూర్తిచేయండి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి

ఆత్మకూరురూరల్ : ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను శరవేగంగా పూర్తి చేయాలని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో గురువారం ఆయన పాల్గొని, మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ నిధులతో చేపట్టిన పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఆయన వివరించారు. సచివాలయాల వారీగా మంజూరు చేసిన రూ.20 లక్షల అభివృద్ధి నిధులతో పాటు నియోజకవర్గంలోని ప్రతి సచివాలయానికి అదనంగా మరో రూ.20 లక్షల నిధులను ఎమ్మెల్యే మంజూరు చేయించారని వివరించారు. ప్రతి పథకం అర్హత కలిగిన లబ్ధిదారుడికి అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నయోమి, ఆర్‌అండ్‌బీ ఏఈ అనిల్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయాధికారి కిశోర్‌బాబు, ఇరిగేషన్ ఏఈ సతీష్‌చంద్ర, వైద్యాధికారి డాక్టర్ అనూషకుమారి, ఉపాధి హామీ ఏపీఓ శిరీషారెడ్డి తదితరులు తమ శాఖలకు సంబంధించి పురోగతిపై సమావేశంలో తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, వైస్ ఎంపీపీ ఉద్దాల పెంచలరావు, కంభంశెట్టి ప్రమీల, తహసీల్దార్ జగదీష్ బాబు, సొసైటీ అధ్యక్షులు సానా వేణుగోపాల్‌రెడ్డి, బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బీఎల్వోలు నిబంధనలు పాటించాలి



సంగం : మాట్లాడుతున్న ఆర్డీఓ మధులత



చేజర్ల : బీఎల్వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్

సంగం : ఎన్నికల కమిషన్ నిబంధనలను బీఎల్వోలు తప్పనిసరిగా పాటించాలని ఆత్మకూరు ఆర్డీఓ మధులత సూచించారు. సంగం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో ఆమె గురువారం సమావేశం నిర్వహించారు. జీరో డోర్ నంబర్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా మృతి చెందిన, గ్రామం వదిలి వెళ్లిపోయిన ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 18 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఆర్‌ఐ రాజ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

మార్పులు, చేర్పులకు అవకాశం

చేజర్ల : స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఓటర్ల జాబితాపై బీఎల్వోలతో తహసీల్దార్ కృష్ణ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలస వెళ్లిన వారి వివరాలను తెలుసుకుని జాబితా నుంచి తొలగించాలన్నారు. ఓటర్ల మార్పులు, చేర్పులకు అవకాశం ఉందన్నారు. కొత్త ఓట్ల నమోదుకు జనవరి 12వ తేదీ వరకు గడువు పొడిగించారని వివరించారు. జనవరి 22న ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో డీటీ విజయ్ పాల్గొన్నారు.